



నమస్తే తెలంగాణ
హైదరాబాద్
హైదరాబాద్- మేడ్చల్
13 | హైదరాబాద్, శనివారం 23 మార్చి 2024 | HYDERABAD



సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్యే మల్లారెడ్డి, మల్కాజిగిరి ఎంపీ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి

## మోదీ హఠావో.. దేశ్‌కో బచావో

ఢిల్లీ లిక్కర్ పాలసీ కేసులో ఏ పాత్ర లేని ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్‌ను ఈడీ అరెస్టు చేయడం దుర్మార్గమని ఆమ్ ఆద్మీ పార్టీ తెలంగాణ రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ దిడ్డి సుధాకర్ మండిపడ్డారు. ఈ మేరకు కేజ్రీవాల్ అక్రమ అరెస్టును నిరసిస్తూ ఆమ్ ఆద్మీ పార్టీ శ్రేణులతో కలిసి ఆయన నాంపల్లిలోని బీజేపీ ప్రధాన కార్యాలయాన్ని ముట్టడించారు. 'మోదీ హఠావో..దేశ్‌కో బచావో'.. 'బీజేపీ డౌన్..డౌన్' వంటి నినాదాలతో కూడిన ప్లకార్డులు పట్టుకొని నినాదాలు చేశారు. అనంతరం బారికేడ్లను తోసుకుంటూ బీజేపీ రాష్ట్ర కార్యాలయంలోకి చొచ్చుకెళ్లేందుకు యత్నించగా, తోపులాట జరిగింది. పరిస్థితి ఉద్రిక్తంగా మారడంతో పోలీసులు ఆప్ శ్రేణులను అరెస్టు చేశారు.

-సుల్తాన్ బజార్, మార్చి 22



## 25న శ్రీగౌర పూర్ణిమ ఉత్సవం

సిటీబ్యూరో, మార్చి 22 (నమస్తే తెలంగాణ ) : బంజారాహిల్స్‌లోని హరేకృష్ణ గోల్డెన్ టెంపుల్‌లో 25న శ్రీ గౌర పూర్ణిమ ఉత్సవం జరుగుతుందని నిర్వాహకులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. సోమవారం సాయంత్రం 6 గంటల నుంచి ఉత్సవాలు ఘనంగా ప్రారంభమవుతాయని, ముఖ్య అతిథిగా టెంపుల్ ప్రెసిడెంట్ సత్యగౌరచంద్రదాస హాజరవుతారని వెల్లడించారు. మహాభిషేకం, హరినామ సంకీర్తన, ప్రత్యేక ప్రవచనాలు, మహా మంగళహారతి తదితర కార్యక్రమాలు ఉంటాయని వివరించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని కోరారు. మధ్యాహ్నం 1 నుంచి సాయంత్రం వరకు అఖండ హరినామ సంకీర్తన కార్యక్రమం కొనసాగుతుందని తెలిపారు.



***గులాబీ సైనికులం అని ఇంతకాలం చెప్పకు తిరిగిన నేతలంతా కండువాలు మార్చేస్తున్నారు. ఈ నేపథ్యంలోనే చేవెళ్ల ఎంపీ టికెట్ ఆశించి పట్నం సునీతా రెడ్డి కాంగ్రెస్‌లో చేరారు. ఆమెకే టికెట్ కన్ఫర్మ్ అనుకునేంతలోనే కాంగ్రెస్‌లో చేరిన సిట్టింగ్ ఎంపీ రంజిత్‌రెడ్డి టికెట్ దక్కించుకున్నారు. ఇంతవరకు బాగానే ఉన్నా.. అభ్యర్థి గెలుపు కోసం నేతలంతా కలిసికట్టుగా పనిచేసే పరిస్థితిపైనే ఎన్నో అనుమానాలు రేకెత్తుతున్నాయి. హైదరాబాద్, ఉమ్మడి రంగారెడ్డి జిల్లాల నేతల మధ్య సమన్వయం కుదురుతుందా.. పాత, కొత్త పార్టీ కార్యకర్తలంతా కలిసిపోయి పనిచేస్తారా? అన్నది కోటి డాలర్ ప్రశ్నగా మిగిలిపోవడం ఖాయంగా కనిపిస్తున్నది.***

*-రంగారెడ్డి, మార్చి 22 (నమస్తే తెలంగాణ)*

# కాంగ్రెస్‌లో సమన్వయం కుదిరేనా?

### ఇలా చేరి.. అలా టికెట్ దక్కించుకున్న రంజిత్‌రెడ్డి

ఫలించిన ఢిల్లీ లాబీయింగ్

టికెట్ ఆశించి భంగపడ్డ పట్నం సునీతారెడ్డి

నేతలంతా కలిసి పనిచేసే పరిస్థితిపై ఎన్నో అనుమానాలు

**చేవెళ్ల ఎంపీ** స్థానాన్ని కైవసం చేసుకునేందుకు అన్ని రాజకీయ పార్టీలు వ్యూహ, ప్రతి వ్యూహాలకు పదును పెడుతున్నాయి. రెండు సార్లు గెలిచి హ్యాట్రిక్ కొట్టాలని సంకల్పిస్తున్న బీఆర్ఎస్ పార్టీ కాసాని జ్ఞానేశ్వర్‌ను ఎంపీ అభ్యర్థిగా రంగంలోకి దింపింది. బీజేపీ నుంచి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి బరిలో ఉన్నారు. కాంగ్రెస్‌కు సొంత అభ్యర్థిని నిలబెట్టుకోలేని పరిస్థితిలో బీఆర్ఎస్ సిట్టింగ్ ఎంపీ రంజిత్‌రెడ్డికి గాలం వేసింది. అంతకుముందే ఈ ఎంపీ స్థానాన్ని ఆశించిన పట్నం సునీతామహేందర్‌రెడ్డి బీఆర్ఎస్‌ను వీడి కాంగ్రెస్‌లో చేరారు. కానీ.. అనూహ్యంగా రంజిత్‌రెడ్డికి పార్టీలో చేరిన కొద్ది రోజులకే కాంగ్రెస్ టికెట్‌ను ఖరారు చేసింది. రంజిత్‌రెడ్డి ఢిల్లీ స్థాయిలో చేసిన లాబీయింగ్ వల్లే టికెట్‌ను కైవసం చేసుకున్నట్లు తెలుస్తున్నది.

#### మౌనం వెనుక ఆంతర్యమేమిటో..

చేవెళ్ల ఎంపీ టికెట్‌ను రంజిత్‌రెడ్డికి కేటాయించడం అనూహ్యంగా జరిగింది. కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి కోసం అన్వేషణ మొదలు పెట్టక ముందే పట్నం సునీతారెడ్డి బీఆర్ఎస్‌ను వీడి కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు. గత ఫిబ్రవరిలో చేవెళ్లలో భారీ బహిరంగ సభను నిర్వహించగా.. ఆ వేదికపైనే సునీతారెడ్డి పేరును ప్రకటిస్తారని అందరూ భావించారు. అలా.. అనేక సందర్భాల్లోనూ ఆమె అభ్యర్థిత్వంపై ప్రకటన వాయిదా పడుతూ వచ్చింది. ఆ తర్వాత చోటుచేసుకున్న రాజకీయ పరిణామాల క్రమంలో సిట్టింగ్ ఎంపీ రంజిత్‌రెడ్డి సైతం కాంగ్రెస్ వైపు మొగ్గు చూపి పార్టీలో చేరారు. మొదటి నుంచీ టికెట్ ఆశించిన సునీతారెడ్డిని కాదని ఆ తర్వాత పార్టీలో చేరిన రంజిత్‌రెడ్డికే కాంగ్రెస్ అధిష్టానం టికెట్ ఖరారు చేసింది. చేవెళ్ల టికెట్ ఆశించిన సునీతకు కాంగ్రెస్ పార్టీ మల్కాజిగిరి టికెట్ కేటాయించింది. కాంగ్రెస్ పార్టీ చివరలో ఇచ్చిన ట్విస్ట్ పట్నం కుటుంబీకులకు ఒకింత నైరాశ్యం కలిగించేదే.

#### కిందిస్థాయి క్యాడర్ సపోర్టు దక్కేనా !

చేవెళ్ల ఎంపీ ఏడు అసెంబ్లీ స్థానాలు ఉండగా.. బీఆర్ఎస్ నాలుగు స్థానాలను, కాంగ్రెస్ మూడు స్థానాలను గెలుచుకున్నాయి. రెండు పార్టీల మధ్య ఓట్ల శాతం లక్ష దాకా ఉండగా.. ఒకింత బీఆర్ఎస్‌కే ఎక్కువ అనుకూలత ఉన్నది. ఎంపీ రంజిత్‌రెడ్డి బీఆర్ఎస్‌ను వీడి కాంగ్రెస్‌లో చేరడంతో బలాబలాలు మారుతాయని కాంగ్రెస్ భావిస్తున్నది. అయితే కొత్త.. పాత నేతల మధ్య సమన్వయం కుదురుతుందా? అనేది కాంగ్రెస్ పార్టీతో పాటు పొలిటికల్ వర్గాల్లోనూ హాట్ టాపిక్‌గా మారింది. టికెట్ చేజారడంతో ఒకింత నైరాశ్యంలో ఉన్న పట్నం వర్గీయుల నుంచి రంజిత్‌రెడ్డికి సహకారం అందేది సందేహాస్పదమే అవుతుందన్న గుసగుసలు వినిపిస్తున్నాయి.

## మల్కాజిగిరి గెలిచి.. కేసీఆర్‌కు కానుక ఇద్దాం

### రాగిడి లక్ష్మారెడ్డి గెలుపునకు శ్రేణులు కృషి చేయాలి.. మేడ్చల్ ఎమ్మెల్యే మల్లారెడ్డి

బోడుప్పల్, మార్చి 22: పార్లమెంట్ ఎన్నికల్లో మల్కాజిగిరి స్థానాన్ని భారీ మెజార్టీతో గెలుచుకుని మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌కు కానుకగా ఇవ్వడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని..బీఆర్ఎస్ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డిని గెలిపించాలని ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి శ్రేణులకు పిలుపునిచ్చారు. శుక్రవారం బోడుప్పల్ బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో పార్టీ అధ్యక్షుడు మంద సంజీవరెడ్డి అధ్యక్షతన జరిగిన పార్లమెంట్ ఎన్నికల సమావేశానికి ముఖ్య అతిథిగా రాగిడి లక్ష్మారెడ్డి, మేయర్ బుచ్చిరెడ్డితో కలిసి పాల్గొన్నారు. రాగిడి లక్ష్మారెడ్డి మాట్లాడుతూ...ఆరు గ్యారంటీలు, 420 హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ గడిచిన 3 నెలల కాలంలో తెలంగాణను అన్ని రకాలుగా భ్రష్టుపట్టించిందని ఆరోపించారు. ప్రజలు ఇప్పటికే కాంగ్రెస్ పాలనపై విసుగుచెందారని, కేసీఆర్ నాయకత్వం కోసం ఆశగా ఎదురుచూస్తున్నారని చెప్పారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ కొత్త లక్ష్మీరవి గౌడ్, స్థానిక కార్పొరేటర్లు, పార్టీ ప్రధాన కార్యదర్శి మీసాలకృష్ణ పాల్గొన్నారు.

### కాంగ్రెస్‌కు భంగపాటు తప్పదు..

పీర్జాదిగూడ, మార్చి 22: 420 హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీకి రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో భంగపాటు తప్పదని ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి అన్నారు. శుక్రవారం పీర్జాదిగూడ పరిధిలో మేయర్ జక్క వెంకట్‌రెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మల్కాజిగిరి బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి పరిచయ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. ఈ సందర్భంగా మల్లారెడ్డి మాట్లాడుతూ..అమలుకాని హామీలతో ప్రజలను వంచించి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్‌కు ప్రజలు ఈ ఎన్నికల్లో తగిన బుద్ధి చెబుతారన్నారు. అనంతరం రాగిడి లక్ష్మారెడ్డి మాట్లాడుతూ... తెలంగాణకు ప్రపంచస్థాయిలో గుర్తింపు తెచ్చిన ఘనత మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్, మాజీ మంత్రి కేటీఆర్‌కే దక్కుతుందన్నారు. అధికారంలోకి రాగానే పేదల ఇండ్లపై బుల్డోజర్లు పెట్టి కూల్చిన ఘనత కాంగ్రెస్‌కే దక్కిందన్నారు. కేసీఆర్ ఆశీస్సులతో మల్కాజిగిరి ప్రజల ఆశీర్వాదానికి వచ్చిన రాగిడి లక్ష్మారెడ్డిని అధిక మెజార్టీతో గెలిపించాలని మేయర్ జక్క వెంకట్‌రెడ్డి నాయకులు, కార్యకర్తలను కోరారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు సుభాష్‌నాయక్, యుగంధర్‌రెడ్డి, పోచయ్య, మధుసూదన్‌రెడ్డి పాల్గొన్నారు.


అభివాదం చేస్తున్న ఎమ్మెల్యే మల్లారెడ్డి, మేయర్ జక్క వెంకట్‌రెడ్డి, రాగిడి లక్ష్మారెడ్డి

## కారు చక్రాల కింద.. చిన్నారి మృతి

బండ్లగూడ, మార్చి 22: కారు చక్రాల కిందపడి చిన్నారి మృతి చెందింది. ఈ ఘటన అత్తాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. ఇన్‌స్పెక్టర్ వెంకట్‌రాంరెడ్డి కథనం ప్రకారం.. అత్తాపూర్‌కు చెందిన శ్రీను, వసుంధర దంపతులు అక్బర్‌హిల్స్ కాలనీలోని సుల్తానా అపార్ట్‌మెంట్‌లో ఉంటున్నారు. వసుంధర వాచ్‌మన్‌గా పనిచేస్తుండగా.. శ్రీను భవన నిర్మాణ మేస్త్రీ. వీరి కూతురు ఎనిమిది నెలల చిన్నారి రుక్మిణి శుక్రవారం ఉదయం 10 గంటల సమయంలో అపార్ట్‌మెంట్ వద్ద వాకర్‌లో ఆడుకుంటున్నది. అదే అపార్ట్‌మెంట్‌లో ఉండే అయాజ్ అహ్మద్ తన కారును వెనుక (రివర్స్)కు తీస్తున్న సమయంలో వాకర్‌లో ఉన్న కారు వెనుక చక్రాల కిందకు రావడంతో రుక్మిణికి తీవ్ర గాయాలయ్యాయి. చిన్నారిని వెంటనే స్థానిక ఆస్పత్రికి తరలించగా.. పరీక్షించిన వైద్యులు అప్పటికే ఆమె మృతి చెందినట్లు తెలిపారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలను సేకరించారు. అయాజ్ అహ్మద్‌ను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు.



## రివ్యూస్ రాయాలంటూ..

సిటీబ్యూరో, మార్చి 22 (నమస్తే తెలంగాణ): రివ్యూస్ రాయాలంటూ.. పార్ట్ టైమ్ ఉద్యోగాల పేరిట నగరానికి చెందిన ఓ వ్యక్తిని బురిడీ కొట్టించారు సైబర్‌నేరగాళ్లు. డ్రీమ్ డెవలప్‌మెంట్ పేరుతో రూపొందించిన గ్రూప్‌లో పార్ట్ టైమ్ ఉద్యోగాల గురించి తొలుత చర్చించారు. హోటల్స్ ప్రమోట్ చేయడంలో భాగంగా రివ్యూస్ రాయాలంటూ నమ్మించారు. ఆ మాటలు నమ్మిన బాధితుడు.. వాళ్లు చెప్పినట్లు చేశాడు. మొదట కొన్ని హోటళ్ల పేర్లు ఇచ్చి.. వాటికి రివ్యూస్ రాయమని చెప్పారు. ఒక సెట్‌లో 30 హోటళ్ల పేర్లుంటాయి. ఇలా ఒక సెట్ పూర్తి చేస్తే వెయ్యి రూపాయలంటూ.. నమ్మించారు. మొదట బాధితుడికి రూ. 1000 మూడు సెట్ల వరకు మూడు వేలు ఇచ్చారు. ఆ తరువాత మీరు పెట్టుబడి పెడితే ఎక్కువ లాభాలొస్తాయంటూ నమ్మిస్తూ బాధితుడితో మొదట రూ. 25 వేలు, ఆ తరువాత రూ. 50 వేలు డిపాజిట్ చేయించారు. లాభాలొస్తున్నాయంటూ స్క్రీన్‌పై చూపిస్తూ.. మొత్తంగా రూ. 13,57,288 దోచేశారు. ఈ ఘటనపై బాధితుడిచ్చిన ఫిర్యాదుపై సీసీఎస్ సైబర్‌క్రైమ్ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.


సమావేశంలో పాల్గొన్న సైబరాబాద్ సీపీ అవినాశ్ మహంతి

## సమన్వయంతో పనిచేయండి

### అక్రమ డబ్బు, మద్యం సరఫరా అరికట్టండి

### సీపీ అవినాశ్ మహంతి

సిటీబ్యూరో: లోక్‌సభ ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని అన్ని ప్రభుత్వ శాఖల అధికారులు సమన్వయంతో కలిసి పనిచేయాలని సైబరాబాద్ పోలీసు కమిషనర్ అవినాశ్ మహంతి అధికారులకు సూచించారు. శుక్రవారం కమిషనరేట్‌లో రెవెన్యూ, అబ్కారీ, జీఎస్టీ, ఇన్‌కమ్ ట్యాక్స్, పోలీస్ తదితర శాఖల అధికారులతో కలిసి ఏర్పాటు చేసిన సమన్వయ సమావేశంలో సీపీ మాట్లాడారు. ఓటర్లను ప్రభావితం చేసే క్రమంలో అక్రమ డబ్బు పంపిణీ, రవాణా జరిగే అవకాశాలు ఉన్నాయని, దీనిని అరికట్టేందుకు పోలీసులతో పాటు ఐటీ, జీఎస్టీ, రెవెన్యూ అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. రంగారెడ్డి జిల్లా కలెక్టర్ కె.శశాంక్, మేడ్చల్ జిల్లా కలెక్టర్ గౌతమ్ మాట్లాడుతూ పోస్టల్ బ్యాలెట్ ప్రక్రియను వివరించారు. ఈ సారి ఉద్యోగులకు సంబంధించిన ఎపిక్ వివరాలను ఆన్‌లైన్‌లో పొందుపర్చడమే కాకుండా వారికి ఓటు హక్కును వినియోగించుకునేందుకు 10రోజుల సమయాన్ని ఇవ్వనున్నట్లు వెల్లడించారు. సైబరాబాద్ జాయింట్ కమిషనర్(ట్రాఫిక్) జోయల్ డెవీస్, మాదాపూర్ డీసీపీ డా.వినీత్ తదితరులు పాల్గొన్నారు.

### బలవంతంగా హోలీ రంగులు చల్లితే చర్యలు

ఇష్టంలేని వారిపై బలవంతంగా హోలీ రంగులు చల్లితే కఠిన చర్యలు తప్పవని సైబరాబాద్ సీపీ అవినాశ్ మహంతి హెచ్చరించారు. కాగా, హోలీ పండుగ నేపథ్యంలో ట్రై కమిషనరేట్ల పరిధిలో ఈనెల 25 ఉదయం 6గంటల నుంచి 26 ఉదయం 6గంటల వరకు మద్యం దుకాణాలు, బార్ అండ్ రెస్టారెంట్లు, కల్లు కంపౌండ్‌లను మూసివేస్తున్నట్లు ట్రై పోలీసు కమిషనర్లు వెల్లడించారు. 25న కబేళాలు, మాంసం దుకాణాలు, బీఫ్ దుకాణాలను మూసివేస్తున్నట్లు జీహెచ్‌ఎంసీ కమిషనర్ రోనాల్డ్ రాస్ తెలిపారు.




**"మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో మహిళా సాధికారత కేంద్రం, పోషణ్ పక్వాడ కార్యక్రమం శుక్రవారం మారేడ్‌పల్లి భగవత్ రెసిడెన్సీలో జరిగింది. ఈ కార్యక్రమానికి హాజరైన హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి పిల్లలకు అన్నప్రాసన చేశారు.**

-సిటీబ్యూరో, మార్చి 22 (నమస్తే తెలంగాణ )

## కెమికల్స్‌తో అల్లం పేస్ట్

సిటీబ్యూరో: కెమికల్స్‌తో నకిలీ అల్లం వెల్లుల్లి పేస్టును తయారు చేస్తున్న వ్యాపారిని టాస్క్‌ఫోర్స్ పోలీసులు అరెస్టు చేశారు. డీసీపీ రష్మీపెరుమాళ్ కథనం ప్రకారం.. లాలాపేటకు చెందిన నీల వెంకటేశ్వర్లు టైటానియం డైయాక్సైడ్, గ్జాథమ్ గమ్‌లను కలిపి.. అల్లం, వెల్లుల్లి పేస్ట్‌ను తయారు చేసి, చిరు వ్యాపారులకు సరఫరా చేస్తున్నాడు. విశ్వసనీయ సమాచారం మేరకు లాలాగూడ పోలీసు, జీహెచ్‌ఎంసీ అధికారులు కలిసి తయారీ కేంద్రంపై దాడి చేశారు. 1300 కిలోల నకిలీ అల్లం, వెల్లులి పేస్ట్, 20 కిలోల కెమికల్స్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఈ రసాయనాలు రంగుల కోటింగ్, పేపర్, ప్లాస్టిక్, రబ్బర్, పెయింట్స్‌లో ఉపయోగిస్తారు.

## మేడ్చల్ కలెక్టరేట్‌లో గ్రీవెన్స్ కమిటీ

మేడ్చల్, మార్చి 22 (నమస్తే తెలంగాణ): మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కలెక్టరేట్‌లో గ్రీవెన్స్ కమిటీ ఏర్పాటు చేశారు. ఎన్నికల ప్రవర్తన నియమావళి నిబంధనల మేరకు ఈ కమిటీ విధులు నిర్వహించనున్నది. మే 13న జరిగే పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో రూ. 50 వేలకు మించి రవాణా చేస్తూ.. వాటికి సంబంధించి పత్రాలు చూపకపోతే ఆ నగదును సీజ్ చేస్తారు. అయితే సీజ్ చేసిన నగదును ట్రెజరీలో జమ చేస్తారు. నగదుకు సంబంధించిన ధ్రువీకరణ పత్రాలు, రశీదులను చూపించి.. నగదు తీసుకునే అవకాశం ఉంటుంది. ఇందుకోసం ఎన్నికలు ముగిసే వరకు ప్రతి రోజు సాయంత్రం 4 గంటల నుంచి గ్రీవెన్స్ కమిటీ అందుబాటులో ఉంటుందని అధికారులు తెలిపారు.

## తల్లీబిడ్డ తెగువకు సెల్యూట్

### సన్మానించిన డీసీపీ రోహిణి ప్రియదర్శిని

### బేగంపేట జైన్‌నగర్ ఘటనలో ఇద్దరు దుండగుల అరెస్టు ఆయుధాలు స్వాధీనం

సిటీబ్యూరో, మార్చి 22 (నమస్తే తెలంగాణ): బేగంపేటలోని జైన్‌నగర్‌లో ఇద్దరు దుండగులు తుపాకీ గురిపెట్టినా.. వెరవకుండా..తల్లీకుమార్తె చూపిన ధైర్యసాహసాలకు సర్వత్రా ప్రశంసలందుతున్నాయి. వారిద్దరి పోరాటం ఎందరికో స్ఫూర్తిగా నిలుస్తున్నదని పలువురు అభినందనలు తెలుపుతున్నారు. ముఖ్యంగా నార్త్‌జోన్ డీసీపీ రోహిణి ప్రియదర్శిని తల్లీకూతుళ్ల ధైర్యాన్ని అభినందిస్తూ.. వారిని సన్మానించారు. ఘటనకు సంబంధించిన వివరాలను ఆమె శుక్రవారం మీడియాకు వెల్లడించారు. ఖాన్‌పూర్‌కు చెందిన సుశీల్‌కుమార్ , ప్రేమ్ చంద్ర దోపిడీకి ప్లాన్ చేశారు. ఇందులోభాగంగా బేగంపేట జైన్‌నగర్‌లో ఓ ఇంటి వద్ద రెక్కీ నిర్వహించారు. ఈ క్రమంలోనే ఆ ఇంట్లోకి చొరబడి అందిన కాడికి దోచుకుపోయేందుకు గురువారం వచ్చారు. సుశీల్‌కుమార్ హెల్మెట్ ధరించగా, ప్రేమ్‌చంద్ర ముఖానికి మాస్క్ ధరించి.. తలకు టోపీ పెట్టుకున్నాడు. తలుపు వద్దకు వచ్చి ఇంటి యజమానురాలైన అమిత పేరు పిలుస్తూ.. ఎన్‌కే జైన్ పేరుతో కొరియర్ వచ్చిందంటూ చెప్పాడు. ఇంతలో పనిమనిషి ఆ కొరియర్ తీసుకునేందుకు రాగా, ప్రేమ్ చంద్ర ఇంట్లోకి చొరబడ్డాడు. కిచన్‌లోకి వెళ్లి పని చేసే మహిళ మెడకు కత్తిపెట్టాడు. సుశీల్ తలుపు వద్ద ఉన్నాడు. ప్రమాదాన్ని పసిగట్టిన అమిత కూతురు తలుపు వద్ద ఉన్న సుశీల్‌పై దాడి చేసింది. ఆమె తల్లి అమిత అక్కడకు చేరుకొని.. తుపాకీ ఉన్నా..భయపడకుండా.. ఇద్దరు కలిసి సుశీల్‌ను చితకబాదారు. అతడి వద్ద ఉన్న తపంచాను లాక్కొన్నారు. తల్లీకూతుళ్ల దాడితో.. అక్కడి నుంచి సుశీల్ పరారయ్యాడు. బయట జరుగుతున్న కొట్లాటను గుర్తించకుండా లోపలే ఉండిపోయిన ప్రేమ్‌చంద్ర.. ఆలస్యంగా బయటకు రావడంతో అతడిపై కూడా దాడి చేసి.. స్థానికుల సహాయంతో పట్టుకొని పోలీసులకు అప్పగించారు. అప్పటికే పారిపోయిన సుశీల్‌ను సైతం పట్టుకున్నారు. నిందితులిద్దరిని అరెస్ట్ చేసి వారి వద్ద నుంచి తపంచా, రబ్బరు బుల్లెట్లు, రెండు కత్తులు స్వాధీనం చేసుకున్నారు. ఇదిలాఉండగా అమిత కిక్ బాక్సింగ్, కరాటేలో అనుభవం ఉండటంతో భయపడకుండా దొంగలతో వీరోచితంగా పోరాడగా, ఆమె కూతురు కూడా ధైర్యసాహసాలను చూపించింది. ఇంట్లోకి ఆయుధాలతో వచ్చిన దొంగలతో పోరాడిన అమిత, ఆమె కూతురు చూపిన తెగువ అందరికీ ఆదర్శప్రాయమైందని డీసీపీ రోహిణి ప్రియదర్శిని అన్నారు.


దుండగులను ధైర్యంగా ఎదుర్కొన్న తల్లీకూతురును సన్మానిస్తున్న నార్త్‌జోన్ డీసీపీ రోహిణి ప్రియదర్శిని